

సీజనల్ వ్యాధులపై కళాజాతా

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రంగశీల, సూకూరు పంచాయతీలలో కళాజాత బృందం సభ్యులు సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన ప్రదర్శన కల్పించారు. వియస్ ఆర్ మీడియా రాజమండ్రి కళాజాత బృందం సభ్యులు విభూతి శ్రీనివాసరాజు, చిరంజీవిలు గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. సికిల్స్ సెల్ అనీమియ వ్యాధి గ్రస్తులు పౌష్టిక ఆహారం తినాలని సూచించారు. బాల్య వివాహాలు చేసుకోకూడదని తెలిపారు. దోమలు కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శాంతి, మోహన్, టీబీ సూపర్వైజర్ సదానందం, సాయి జానకమ్మ, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు, సిబ్బంది



పాడేరులో ధర్నా చేస్తున్న నాయకులు, స్కీమ్ వర్కర్లు



రంపచోడవరంలో మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి వెంకట్

అక్రమ తొలగింపులు, వేధింపులను నిరసిస్తూ..

కదంతొక్కిన స్కీమ్‌వర్కర్లు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో అక్రమ తొలగింపులను నిరసిస్తూ ప్రభుత్వ స్కీమ్ వర్కర్లు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని పలు మండలాల నుంచి వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లు పెద్దఎత్తున కదిలి వచ్చారు. ఐటీడీఏ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతున్న ఈ తరుణంలో స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, వెలుగు వివోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లను రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉద్వాసనకు గురి చేస్తున్నారని స్కీం వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు అల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాడేరు పట్టణంలో కార్మికులు కదం తొక్కారు. అనంతరం ఈ ధర్నా నుద్దేశించి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కార్మికులు ఏ ప్రభుత్వానికి బానిసలు కాదని, ప్రభుత్వం ఇచ్చిన ఏ పనైనా కష్టమైనా ఇష్టపడి తక్కువ జీతాలతో పని చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు రక్షణగా ఉండవలసిన ప్రభుత్వం ఇటువంటి తొలిగింపులకు పాల్పడితే కార్మికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్మికులు తప్పు చేస్తే ప్రాథమిక విచారణ జరిపి మొదటి తప్పుగా క్షమించి విడిచి పెడతారని, ఎటువంటి విచారణ చేపట్టకుండా నిర్ధాక్షణంగా తీసేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వందలాది మంది ఉపాధి హామీలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తీసివేయడం జరిగిందని చెప్పారు. కార్మికులకు రాజకీయ కక్షలు అంట కలిపి చేసే పనిలో నుంచి తొలగిస్తే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, ప్రభుత్వం మారిన తర్వాత రాజకీయంగా కార్మికులను వేధింపులకు గురి చేస్తుందని, గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏముందని ప్రశ్నించారు. వెలుగు వివోఏల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాను, రాజ్ కుమార్ మాట్లాడుతూ, కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.

పాడేరు, రంపచోడవరంలో భారీ ర్యాలీ, ధర్నా

కలెక్టర్ లేకపోవడంతో రెవెన్యూ అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే.శంకర్రావు జి.సత్యనారాయణ, సోమలింగం, రవి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా నాయకులు కోటేశ్వరరావు, పాంగి కృష్ణారావు, మజ్జి సురేష్ కుమార్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకులు దాసమ్మ, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు రాములమ్మ, పూర్ణిమ, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, మినుముల జ్యోతి, రైతు మిత్ర సంఘం నుంచి యేసురత్నం, కార్మికులు పాల్గొన్నారు.

రంపచోడవరం : అక్రమంగా తొలగింపులను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనికి ముందు సిఐటియు జిల్లా కార్యాలయం నుండీ ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.శాంతిరాజు, నాయకులు కె.రామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం 2360 మంది ఉపాధి హామీ పీల్డ్ అసిస్టెంట్లును, 750 మంది మధ్యాహ్నం భోజనం కార్మికులను, 500 మంది వెలుగు యానిమేటర్స్‌ను తొలగించిందని చెప్పారు. అధికార కూటమి నాయకులు వేధింపులకు గురి చేస్తూ ఉద్యోగాలకు తక్షణమే రాజీనామాలు చేయాలని తీవ్ర ఒత్తిడి తెస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని దేవిపట్నం మండలం ములకల గూడెం అంగన్వాడీ కార్యకర్త నాగమణిపై స్థానిక టీడీపీ నాయకులు రాజకీయంగా వేధిస్తూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లిరెడ్డి, సీఐటీయూ నాయకులు కె.చెల్లాయమ్మ, రత్నకుమారి, అరగటి, రామకృష్ణ, వీరాలక్ష్మి, రాధమ్మ, జె.వీరమాణిక్యం, మంగాయమ్మ, గౌరి, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ కార్మికులు, యానిమేటర్స్ పాల్గొన్నారు.

మన్యంలో పసికందుల మృత్యుఘోష

- పది రోజుల వ్యవధిలో నలుగురు మృతి
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల తీరును తేటతెల్లం చేస్తున్న సంఘటనలు



బొడ్డుగూడెంలో పసికందు మృతి చెందడంతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సింగన్నగూడెం పసికందు మృతదేహం

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఏజెన్సీ ప్రాంతంలో పసికందులు మృత్యువాత పడుతున్నారు. జ్వరం, వాంతులు, శ్వాసఆడక పది రోజుల వ్యవధిలో నలుగురు పసిబిడ్డలు మృతి చెందారు. సరైన వైద్యం అందకపోవడంతోనే వీరంతా మరణించారంటే ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఎంత అధ్వానంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కన్నవారికి గర్భశోకం మిగల్చడంపై ఏజెన్సీ ప్రాంతవాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు.

చింతూరు మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన బొగ్గ అంజిబాబు, చిలకమ్మ దంపతులకు చెందిన 4 నెలల పసిబిడ్డ శ్వాస ఆడకపోవడంతో ఈనెల 3న శనివారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తలరించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో వైద్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పసికందు మృతి చెందింది.

సింగన్నగూడెం గ్రామానికి చెందిన సవలం కన్నయ్య, నాంచారమ్మ దంపతుల రెండు నెలల పసిబిడ్డ కొన్ని రోజులుగా శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతుండగా భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి గురువారం తరలించారు. వైద్యం కొనసాగిస్తూ ఉండగానే ఆ బాబు వాంతులతోడై చనిపోయాడు.

కన్నాపురం, గంగన్నమెట్ట గ్రామానికి చెందిన సున్నం దుర్గారావు రెండు నెలల పసిబిడ్డ కూడా ఇదే తరహాలో శ్వాస ఆడక పది రోజులు క్రితం కన్ను మూసింది.

చదలవాడ గ్రామానికి చెందిన సాంధుల దేవిరెడ్డి, భద్రమ్మ దంపతుల ఆరు నెలల శివువు టైఫాయిడ్, శ్వాస సంబంధిత సమస్యతో చింతూరు ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమించి ఏడు రోజుల క్రితం చనిపోయింది.

పది రోజుల వ్యవధిలో నలుగురు చిన్నారులు మృతి చెందినా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నేటికీ మండలంలో సందర్శించి చిన్నారుల మరణానికి గల కారణాలను తెలుసుకొనే ప్రయత్నం చేయకపోవడం దౌర్భాగ్యం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నష్టం జరిగిపోయాక గ్రామాల్లో వైద్య శిబిరాలు పేర ప్రచారాలకు పరిమితం అవటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా పై నాలుగు సంఘటనలు ప్రభుత్వ వైద్య సేవల తీరును ప్రశ్నిస్తున్నాయి. గిరిజనులకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం, వైద్యాధికారుల నిర్లక్ష్యం తేటతెల్లం చేస్తున్నాయి. ఏరియా ఆసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడంతో గిరిజనుల పసికందులు అర్ధాంతరంగానే తనువు చాలించాల్సిన దుస్థితి నెలకొంది.

ఐటీడీఏ కేంద్రంగా ఉన్న చింతూరు మండలంలో, అందులోనూ ఏరియా ఆసుపత్రి ఉన్న దగ్గర చిన్నారులు మృతి చెందటంపై ఆదివాసీ గిరిజన సంఘాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాబోయే కాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు చర్యల్లో భాగంగా దోమల మందు పిచికారీ చేయాలని, ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే చిన్నారుల మృతి పట్ల సమగ్ర విచారణ జరిపి వాటి మూలాలను కనుగొని మరణాలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రాంతవాసులు కోరుతున్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి : గాంధీబాబు

బాలల హక్కుల పరిరక్షణ కమిటీ మాజీ సభ్యులు గాంధీబాబు సోమవారం బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసికందుల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిప్యూటీ డిఎంహెచ్ఒ పుల్లయ్య వివరణ

పసికందుల మృతువాతపై డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ పుల్లయ్యను ప్రజాశక్తి వివరణ కోరగా బొడ్డుగూడెం గ్రామంలో పాప పాలు తాగే సమయంలో పొలమారడం వల్లే చనిపోయిందని తెలిపారు. మిగిలిన పసికందుల మృతి విషయంపై విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.



కన్నాయిగూడెంకు చెందిన దుర్గారావు దంపతులను పరామర్శిస్తున్న గాంధీబాబు

కొర్రాయి వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొర్రాయి పంచాయతీలో నిలిచి పోయిన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బి పోతురాజు, నాయకుడు పి.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న జాంగుడ వంతెనను సిపిఎం నాయకులు సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొర్రాయి -జాముగుడ బ్రిడ్జి నిర్మాణం జరగలేదని, ఈ వంతెనకు ఆనుకుని కొర్రాయి, కొల్లపుట్ పంచాయితీల ప్రజలు సుమారు 22గ్రామాలు ఉన్నాయన్నారు. ఇదే మార్గంలో ఆంధ్రా, ఒరిస్సా ప్రజలు కూడా ప్రయాణం చేస్తుంటారని చెప్పారు. ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్ళుగా ప్రజలు ఆందోళన చేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల వద్ద మొర పెట్టుకున్నా పలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రోజెక్టు అధికారికి కూడా పిర్యాదు చేసినా బ్రిడ్జి నిర్మాణం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వంతెన నిర్మాణం కోసం చొరవ చూపాలని కోరారు. లేదంటే ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పి సత్యనారాయణ, పి.మోహన్ దాస్, జగన్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధకారులు

తాత్కాలిక రేకుల షెడ్ల నిర్మాణాలకు చర్యలు

-ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల భవనాలు కూలి నేలమట్టమయ్యాయి. ఈ విషయమై "విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం" శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. తాత్కాలికపు రేకుల షెడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఎంపీడీవో కిరణ్ కుమార్, ఎంఈఓ కృష్ణమూర్తి లు సోమవారం సందర్శించారు. వనబసింగి పంచాయతీకి చెందిన టోంగికోట ఎంపీపీ పాఠశాలలో రేకుల షెడ్డు నిర్మాణానికి త్వరితగతిన పనులు చేపడతామన్నారు. పెదగూడ పంచాయతీకి చెందిన బాంకుబెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణానికి సుమారు రెండు లక్షల 50 వేలు జెడ్పి నిధులతో రెండు నెలల వ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. నూతన భవనాల నిర్మాణాలకు నివేదికలను ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దగూడ కాంప్లెక్స్ సిఆర్‌పి అనిల్ కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మట్టుజోరు పంచాయితీ పెట్టుగోడలు గ్రామంలో ఆదివాసీ హక్కులు, చట్టాలపై ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి కే.రామారావు, టి కృష్ణారావులు మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు సంక్రమించిన ప్రత్యేక హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనం కోసం మారుస్తున్నారన్నారు. జీఓ 3ని పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసి దినోతవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మనోజ్ కుమార్, ఎంపిడీఓ, వైద్యాధికారి నిఖిల్, ఇన్చార్జి తహసీల్దార్ జి,రంగారావు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ మాట్లాడారు. యువత గంజాయి, సారా, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. డ్రగ్స్ బారిన పడితే యువత భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరదల్లో ఇబ్బంది పడ్డ ఉద్యోగులకు

ఆర్థిక సాయం రూ.3వేలు చెల్లించాలి

తహశీల్దారుకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదలు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగస్తులకు వరద సాయం రూ.3వేలు తక్షణమే ఇవ్వాలని స్థానిక తహశీల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్‌కు సిపిఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ వరదల్లో ఇల్లు మొత్తం నీట మునిగి అనేక అవస్థలు ఎదుర్కొన్న ప్రజానీకానికి ప్రభుత్వం రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసిందని, అదేవిధంగా ఉద్యోగస్తులు ఇల్లు కూడా నీట మునిగాయని, వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారికి కూడా తక్షణమే వరదల్లో ఇచ్చిన ఆర్థిక సహాయం రూ.3వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన తహశీల్దారు మాట్లాడుతూ ఈ సమస్యలను పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి, వరదల్లో ఇబ్బంది పడ్డ ఉద్యోగస్తులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, కారం సుందరయ్య, కమ్మచిచ్చు సత్తిబాబు, సోడి మల్లయ్య, నాళ్లారపు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించి డిఎస్‌సికి సిద్ధమయ్యే గిరిజన అభ్యర్థులకు చింతూరు ఐటిడిఎ ఆధ్వర్యాన నిర్వహించే ఉచిత శిక్షణకు ఆగస్టు 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీలోని బీఈడీ, డిఇడి, టెట్ పాసైన గిరిజన అభ్యర్థులకు చింతూరు ఐటిడిఎ పరిధిలోని ఎటపాక యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.1/3 శాతం రిజర్వేషన్ సదుపాయం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6 నుండి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఫైనల్ మెరిట్ లిస్టు ఆగస్టు 14వ తేదీన ఐటీడీఏ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తామని చెప్పారు ఫైనల్ లిస్ట్ ప్రకారం ఆగస్టు మూడో వారం నుండి సుమారు 75 రోజులపాటు 50 మంది గిరిజన అభ్యర్థులకు భోజనం, వసతి సౌకర్యంతో ఉచిత శిక్షణ అనుభవజ్ఞులైన గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణకు అర్హత కలిగిన యువతీ యువకులు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలన్నారు మరిన్ని వివరాలకు వినోద్‌వర్మ 9573725677, సందీప్ 8185921373 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో మొక్కల నాటివేత



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పెద్దగరువు, మత్స్యపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వివిధ రకాలైన మొక్కలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నాటారు. మొక్కలతో విద్యార్థులకు పాఠశాల ప్రాంగణం చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని ఉపాధ్యాయులు సత్యారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న వైద్యులు

జాంగుడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ జాంగుడ గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 20 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలతో కలిగే లాభాలపై గిరిజనులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, భానుమతి, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణకు చర్యలు



దోమల మందును పిచికారి చేయిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-అనంతగిరి: మలేరియా వ్యాధి చెందకుండా పూర్తిగా అరికట్టేందుకు ముందస్తు ప్రణాళికలతో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అనంతగిరి ఎంపిహెచ్ఇఓ బి. నర్సింగరావు తెలిపారు. కాశీపట్నం సబ్ సెంటర్ పరిధి సారవనిపాలెం గ్రామంలో సోమవారం వైద్య బృందం సందర్శించి ప్రజల ఆరోగ్యంపై ఇంటింటా సర్వే చేపట్టారు. గ్రామంలో మురుగు నీటి కుంటలు లేకుండా చూడాలన్నారు. పశువుల పాకలు ఊరుకు దూరంగా ఉంచాలని సూచించారు.

రణధీర్ కుటుంబాన్ని పరామర్శించిన నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : అనారోగ్యంతో గత నెల 27న మృతిచెందిన రణధీర్ కుటుంబాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యారామ్, ప్రజా నాట్యమండలి నాయకులు గుర్రం రమణ మంగళవారం సాగర్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. సిపిఎం విశాఖ జిల్లా పూర్వ కార్యదర్శి జె.సత్తిరాజు మనవడు, నేవల్ డాక్‌యార్డు సిఐటియు క్రియాశీల సభ్యుడు జెస్సి వెంకటేశ్వరరావు కుమారుడు రణధీర్ మృతి అత్యంత విచారకరమని, కుటుంబానికి తీరని లోటు అని నర్సింగరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని ఓదార్చారు. మంగళవారం సాగర్‌నగర్‌లో జరిగిన రణధీర్ పెద్ద కర్మ కార్యక్రమానికి నాయకులు విచ్చేసి నివాళులర్పించారు.

వరద బాధితులకు సిపిఎం విరాళాల సేకరణ



అరకులోయలో విరాళాలు సేకరిస్తున్న సురేంద్ర,ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకు అండగా సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ సేకరించారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, వరద బాధితులకు సహాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రూ.10,420 విరాళాలు సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కిల్లో జగన్నాథం, సిహెచ్ గురుమూర్తి, పద్మాపురం ఉపసర్పంచ్ జన్ని భగత్‌రామ్, పాంగి నానిబాబు, కోగేశ్వరరావు, పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలని వారపు సంతలో సిపిఎం నేతలు విరాళాలు సేకరించారు. రూ.7,081లు విరాళాలు సేకరించామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జెడ్పీటిసి దీసరి గంగరాజు, సర్పంచ్ కిల్లో. మొస్య, వేంగడ సీపీఎం మాజీ సర్పంచ్ సివెరి కొండలరావు, మండల కార్యదర్శి ఎస్.నాగులు, మండల కమిటీ సభ్యులు. ఎన్.సురేష్, లక్షణారావు, కె.చంటి తదితరులు పాల్గొన్నారు



అనంతగిరిలో విరాళాలు సేకరిస్తున్న గంగరాజు, నాయకులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



పంపిణీ చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీ రేగా, కరకవలస, కొత్తవలస పాఠశాలలో సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు చొరవతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో 132 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5 నోట్ బుక్స్ దాతల సహాయంతో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ,ప్రతి సబ్జెక్ట్‌కు ఒక నోట్ బుక్ చొప్పున 5 పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఎలిమెంటరీ పాఠశాలలో పిల్లలకు నోట్ పుస్తకాలు చాలా అవసరమన్నారు. పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గత్తుం బుజ్జిబాబు, వార్డు మెంబర్ కె.శంకర్రావు, జి.శాంతి కుమారి, మండల నాయకులు సిహెస్ గురుమూర్తి, కిల్లో బుజ్జిబాబు, జోషి, సత్యారావు, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో తల్లి పాల వారోత్సవాలు



ముంచంగిపుట్టులో ర్యాలీ...

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో పలు అంగన్వాడి కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించామని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి ప్రకటనలో పేర్కొన్నారు. వనుగుమ్మ అంగన్వాడీ కార్యకర్త సూరమ్మ బాలింతలు, గర్భిణీలకు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు. తల్లి పాలు దివ్య ఔషధమని వివరించారు.

అరకులోయ: మండలంలోని చినలబుడు పంచాయితి హట్టగుడ అంగన్వాడి కేంద్రంలో సోమవారం తల్లిపాలపై ఐసిడిఎస్ సీడిపిఓ శారద అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తల్లీ పాల ప్రత్యేకత, ప్రయోజలను నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమని, ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలని సూచించారు.పుట్టిన గంటలోపే బిడ్డ తల్లి మురుపాలు పట్టించడం కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు అరుణ, లక్ష్మి, కార్యకర్తులు, జి విజయకుమారి, భీమల, కమల, డొమిని తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

శిబ్దాస్ ఘోష్ ఆలోచనలు నేడు అవసరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ యుగపు గొప్ప మార్క్సిస్టు తత్వవేత్తలలో శిబ్దాస్ ఘోష్ ఒకరని, అతని ఆలోచనలు, ఆచరణ నేటి సమాజానికి అవసరమని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.గోవిందరాజులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు శిబ్దాస్ ఘోష్ 48వ వర్ధంతిని సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

వాగులో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అదృశ్యమైన యువకుడు జాంగుడ సమీపంలోని పొలం గెడ్డ వాగులో మృతి చెందినట్లు గుర్తించామని స్థానిక సీఐ రుద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత నెల 30న కంచరపాలెంకు చెందిన బంగారి కోటేశ్వరరావు, ఈశ్వరి దంపతులకు చెందిన చంద్రకాంత్ (17) అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తుండగా మండలంలోని కోర్రాయి పంచాయతీ జాంగుడ పొలం గెడ్డ వాగులో యువకుడు మృతి చెందినట్లు సోమవారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీంతో పోలీసులు సంఘటన ప్రదేశంలో చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు. యువకుడు మృతికి గల కారణాలపై సమగ్రంగా దర్యాప్తు చేపడతామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో 'విపిజెఎ' ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (విపిజెఎ) ఆధ్వర్యాన ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించనున్న 185వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే పోస్టర్‌ను సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. జివిఎంసి సహకారంతో ఏటా బీచ్ రోడ్‌లోని విశాఖ మ్యూజియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పిఎన్.మూర్తి, కార్యదర్శి జి.తిరుపతిరావు మాట్లాడుతూ, ఈ నెల 19న ఉదయం 10:30 గంటలకు ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. విశాఖ ఫొటో జర్నలిస్టులు ఈ ఏడాదిలో తన కెమెరాలో బంధించి అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించనున్నారని చెప్పారు. రెండు రోజులపాటు వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు, యువత, పర్యాటకులు కూడా సందర్శిస్తారని తెలిపారు.పోస్టర్ ఆవిష్కరణలో విశాఖ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డిఎస్‌సి, టెట్‌పై 7న ఉచిత అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఎస్‌సి, టెట్‌పై ఉచిత అవగాహనా సదస్సు డాబాగార్డెన్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ పి.సతీష్ తెలిపారు. ప్రముఖ కోచింగ్ నిపుణులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో పాటు మరికొందరు నిష్ణాతులు పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సులో 160 పేజీల విద్యా మనో విజ్ఞాన శాస్త్ర మెటీరియల్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డిఎస్‌సి, టెట్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా 9347205549 నెంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

పారా అథ్లెట్ విజేతలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: బెంగళూరు కంఠీరవ స్టేడియం వేదికగా జులై 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్ -2024లో గెలుపొందిన క్రీడాకారులను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం అభినందించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు కె.తేజశ్రీ లాంగ్ జంప్‌లో బంగారు పతకం, 100 మీటర్స్‌లో రజత పతకం, ఎం.సాయి నిఖిల్ గౌతమ్ 1500 మీటర్స్‌లో కాంస్య పతకం, జి.సూర్య రోహిత్ 100 మీటర్స్‌లో కాంస్య పతకం, 400 మీటర్స్‌లో కాంస్య పతకం, బి.లక్ష్మణ 100 మీటర్స్‌లో రజతం, 400 మీటర్స్‌లో బంగారు పతకం, కె.గౌతమ్ 400 మీటర్స్‌లో రజతం, లాంగ్ జంప్‌లో బంగారు పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని విశాఖపట్నం జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ గిరీష్, పారాస్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ వి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 78 అర్జీలు



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న ఏపీఓ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమానికి 78 అర్జీలు అందాయి. వీటిని ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, ఏడియం అండ్ హెచ్ఓ జి.శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డిఎల్‌పిఓ రాఘవన్, డాక్టర్ ఇందిరా, డియల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సుబ్బయ్య, జి.డేవిడ్ రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతు.... వరినాట్లు వేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-విఆర్.పురం : వరదలు తగ్గడంతో మండలంలోని వరి సాగుకు రైతాంగం సన్నద్ధమయ్యారు. దీంతో కూలీలకు చేతినిండా పనులు దొరికే అవకాశం ఉంది. నూనె వారిగూడెం, కుందులూరు, విఆర్ పురం, పెద్ద మట్టపల్లి తదితర గ్రామాలలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఇదే తరహాలో వాతావరణం ఉంటే అన్ని గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతాయని రైతులు చెబుతున్నారు. సన్న చిన్నకారు రైతులు తమకున్న కొద్ది పాటి భూమిలో ఇప్పుడు వరి నాటు వేస్తున్నారు. మైదాన ప్రాంతంలో మిర్చి నారు మడులు కట్టి విత్తనాలు వేస్తున్నారు.

మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి : స్థానిక కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో ఎంపీడీవో ఎ.వీర కిశోర్, ఏపీవో రెడ్డి బాబు ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీర కిషోర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. విద్యార్థులు తమ ఇంట్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మయూరి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపిడిఓ, ఎపిఓ

జిఓ 3ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3ను పునరుద్ధరించి ఏజెన్సీలోని 100శాతం ఉద్యోగాలను గిరిజన నిరుద్యోగులతో భర్తీ చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. చింతూరు కేంద్రంలో సోమవారం జరిగిన గిరిజన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో పర్మినెంట్ ఏఎన్ఎంలను నియమించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో డిఎస్‌సి ఉచిత కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోనే తీసుకోవాలని, ఎటపాక వైటిసిలో శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం మండల నాయకులు మట్టం రాజయ్య, వీరబోయిన దిలీప్, రామ్‌చరణ్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలపై దృష్టి

రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి : ఐదు పిహెచ్‌సిలకు ఇన్వెర్టర్ల విరతణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అంగన్వాడీ కార్యకర్తగా పని చేసిన తనకు పిహెచ్‌ల్లో నెలకొన్న సమస్యలు, రోగుల ఇబ్బందులు బాగా తెలుసునని, ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యల పరిష్కారం పట్ల దృష్టి సారించడం జరిగిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మండలంలోని రాజవొమ్మంగి, లాగరాయి, జడ్డంగి పీహెచ్సీల్లో రోగుల సౌకర్యార్థం తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన 5 ఇన్వెర్టర్లను ఎమ్మెల్యే శిరీషదేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ దంపతులు సోమవారం అందజేశారు. ఇటీవల రాజవొమ్మంగిలో నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో పిహెచ్‌సిల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు రోగులు పడుతున్న ఇబ్బందులను సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, తన మొదటి జీతంతో ఎమ్మెల్యే ఈ ఇన్వెర్టర్లను కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రుల్లో రోగుల సౌకర్యార్థం బెడ్లు,మందులు, పరికరాలు, అంబులెన్స్, సిబ్బంది కొరత వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని అమీనాబాద్‌లో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వడుగుల జ్యోతి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు జి.రమణి, ఎం.గణలక్ష్మి, కె.మురళీకృష్ణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ ఎస్.వెంకయ్య, ఆయా పీహెచ్సీల వైద్యాధికారులు సుష్మ, ఉషశ్రీ, యామిని ప్రియ, టిడిపి నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరరావు, డి శివాజీ రాజు, ఘనజాల తాతారావ్, బిజెపి, జనసేన నేతలు తాముసూరిబాబు, బొద్దిరెడ్డి త్రిమూర్తులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలకు ఇన్వెర్టర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి



వరి నాట్లు వేస్తున్నఎమ్మెల్యే

వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శిరీషదేవి మండల పర్యటన నేపథ్యంలో జడ్డంగి నుండి రాజవొమ్మంగి మార్గంలో వెళ్తూ ఒట్టిగడ్డ గ్రామ శివారులో ఆగి వరినాట్లు వేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారితోబాటు కొద్దిగా సేపు వరి నాట్లు వేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కూలీలకు హామీ ఇచ్చారు.

సమస్యలపై వినతి

ఎమ్మెల్యే శిరీషాదేవి పర్యటన సందర్భంగా లాగరాయి గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విన్నవించుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, వీధిరోడ్లు సమస్యలను పరిష్కరించాలని, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సు సర్వీసు రోజులో రెండు పూటలైనా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, కిర్రాబు వాగుపై ఆనకట్టు నిర్మించాలని గ్రామస్తులు జిరెడ్డి వెంకట రమణ, నగేష్, రాజకుమార్, లోవప్రసాద్ కోరారు.

సీజనల్ వ్యాధులపై కళాజాతా

ప్రజాశక్తి-చింతూరు : గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు చింతూరు డివిజన్లో కళాజాతా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఐటిడిఎ పిఓ కావూరి చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు, వరదలు వలన మన్యంలో కీటక జనత వ్యాధులు, కలుషిత నీరు, ఆహారం ద్వారా సంభవించు టైఫాయిడ్, కామెర్లు, అనిమియా, సికిల్ సెల్ అనిమియా తదితర వ్యాధులు, ఇతర మూఢ నమ్మకాలు గురించి కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొనారు. డివిజన్లో మొత్తం 25 ప్రదేశాలలో, రోజుకి 4 ప్రోగ్రామ్స్ చొప్పున ఈ కళాజాతా జరుగుతుందన్నారు. ఈ నెల 6 నుండి 12వ తేదీ వరకు సూచించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు. సంబంధిత వైద్యాధికారులు, పంచాయతీరాజ్, విద్య, వెలుగు, తాగునీటి సరఫరా, అంగన్వాడీ శాఖల వారు క్షేత్రస్థాయిలో సిబ్బందికి షెడ్యూల్ వివరాలు తెలియచేసి, వారి ద్వారా ప్రజలను కళాజాతా కర్యాక్రమాల్లో పాల్గొనే విధంగా చూడాలని ఆదేశించారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

ప్రజాశక్తి-చింతూరు :ఈనెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై నాలుగు మండలాల్లోని గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో చింతూరు ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం ఐటిడిఎ పిఓ కావూరి చైతన్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించి ప్రోత్సహించడం జరుగుతుందని, దానికి కావలసిన ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, ఏపీఓ కే సుజాత, ఏవో ఎం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు : అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై జె. రామకృష్ణ సోమవారం వెల్లడించారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం... స్థానిక మారమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిస్సా నుండి ఆంధ్రకు ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వస్తుండగా వారిని తనిఖీ చేశారు. వారి వద్ద 10 కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు యువకుల్ని అదుపులోకి తీసుకొని, 10 కేజీల గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ దుర్గాదేవికి చెందిన మండి శివరాము, ఒడిస్సా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ గుంటవాడ పంచాయతీకి చెందిన పాంగి సునీల్, నెల్లూరు జిల్లాకు చెందిన దక్షిణాది కుమార్‌ను సోమవారం కేసు నమోదు కేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మిత ప్రాంతంలో సర్వే

ప్రజాశక్తి -సీలేరు : సీలేరులో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మిత ప్రాంతంలో జియోజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం సోమవారం సర్వే నిర్వహించింది. ఢిల్లీ నుంచి వచ్చిన బృందం సభ్యులు ముందుగా పంపు స్టోరేజ్‌కి సంబంధించి నిర్ణయించిన తొమ్మిది ప్రాంతాల్లో పర్యటించారు. ప్రాజెక్టు ప్రతిపాదించిన అంశాలను పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. జల విద్యుత్ కేంద్రం, టన్నెల్ నిర్మించే ప్రదేశం, డంపింగ్ యార్డ్ ప్రాంతాలతో పాటు గుంటవాడ జలాశయం ప్రాంతాలను సందర్శించారు. వ్యాప్ కో ఇచ్చిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్‌ని పరిశీలించారు. సర్వే బృందానికి వచ్చిన పలు అనుమానాలను పంపు స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి నివృత్తి చేశారు. డిఈఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.